క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు



చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి

కుంటాల: పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లింబా (కే)గ్రామంలో చెత్త సేకరణ షెడ్డు, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, నర్సరీలను శుక్రవారం పరిశీలించారు. గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రపర్చాలన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, ఎంపీవో రహీమ్, కార్యదర్శి గంగాప్రసాద్, ఎఫ్‌ఏ సాయి, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



దేవునిగూడెంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కిషన్

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం, బుత్కూర్ పంచాయతీలోని గోండుగూడలో రూ.4 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ సింగరి కిషన్, ప్రజాప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్ని పంచాయతీల్లో నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. జెడ్పీటీసీ శారద, వైస్ ఎంపీపీ రాజునాయక్, సర్పంచులు పోసవ్వ, అంజన్న, టీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య యాదవ్, రాజనర్సయ్య, నాయకులు గోపి, తిరుపతి, శ్రీనివాస్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి'



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

ముథోల్: అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రకటనను స్వాగతిస్తూ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ఉద్యోగుల పేస్కేల్ అమలు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు రవి, యోగేష్ తదితరులు ఉన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఏఈవో ప్రవీణ్

ముథోల్: వరి పంటల్లో కాండంపై వచ్చే తొలుచుపురుగు తెగుళ్ల నివారణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈవో వాగ్మారే ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ వరి పంటలో చీడపీడలు, వాటి నివారణ చర్యల కోసం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు తెలియజేశారు. తొలుచు పురుగు నివారణ చర్య గురించి పంట క్షేత్ర పరిశీలన ద్వారా వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

ప్రజాభీష్టం మేరకే లబ్ధిదారుల ఎంపిక

ఖానాపూర్: ప్రజాభీష్టం మేరకే డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని బీఆర్‌ఎస్ ఐటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదేశాలతో ఉన్నతాధికారులు నిబంధనల మేరకు బహిరంగ ప్రకటన ద్వారా దరఖాస్తులు స్వీకరించారని అన్నారు. ఈ దరఖాస్తులను మండల స్థాయి అధికారులు బృందాలు ఏర్పడి ప్రతి ఇంటికెళ్లి విచారణ చేపడుతున్నారని అన్నారు. దరఖాస్తులపై అర్హుల తాత్కాలిక జాబితా ప్రదర్శనపై వార్డు సభలు నిర్వహించి, అభ్యంతరాలను అధికారులు పరిగణలోకి తీసుకుంటున్నారని అన్నారు. కొందరు ప్రతిపక్ష నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?



అధ్వానంగా ఓలా–అంబుగామా రోడ్డు



ప్రమాదకరంగా అంబుగామా ఘాట్ మలుపులు

- ఏడాదిగా సా..గుతున్న పనులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

కుంటాల: గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు అవసరం ఉన్నచోట ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని ఓలా నుంచి అంబుగామా వరకు 7 కి.మీ దూరంతో రోడ్డు నిర్మించేందుకు రూ. కోటి 50 లక్షల నిధులు మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ పనులు మొదలెట్టారు. బిల్లులు రాకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో ఈ రోడ్డు మార్గంలో వెళ్లే ప్రజలు, ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు.

ఏడాదిగా సాగుతున్న పనులు

మండలంలోని అంబుగామా గ్రామం ఎత్తైయిన గుట్ట ప్రాంతంపై ఉంది. కొత్తగా పంచాయతీ ఏర్పడిదంటే తండావాసులు సంబరపడ్డారు. ప్రభుత్వం కొత్త పంచాయతీ ఏర్పడగానే రోడ్డు మరమ్మతుకు నిధులు కేటాయించింది. పనులు ఏడాదిగా సాగుతున్నాయి. సదరు కాంట్రాక్టర్ ఉన్న రోడ్డుపై డస్ట్ వేసి వదిలేయడంతో కంకరతేలి ఉండడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు మార్గంలో తరచూ వాహనాలు మొరాయించడంతోపాటు పంక్చర్లు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామానికి రాని పల్లె వెలుగులు

మండలంలోని అంబుగామా గ్రామానికి రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో గ్రామానికి పల్లె వెలుగులు రాక ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది. అంబుగామా నుంచి కుంటాల, ఓలా గ్రామాలకు వెళ్లి విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసిస్తారు. బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. రూ. 500 నుంచి 800 వరకు ప్రయాణ చార్జీలు చెల్లించి వెళ్లి వస్తున్నారు. నిర్మల్, నిజామాబాద్ వెళ్లి రావాలంటే రోజంతా సమయం వృథా అవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అంబుగామా సమీపాన గుట్ట ప్రాంతంలో ప్రమాదకరంగా మూలమలుపులతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గ్రామ పంచాయతీ ఏర్పడిదంటే సంబురపడ్డాం. రోడ్డు చెడిపోవడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మా గ్రామం నుంచి ఉన్నత చదువుల కోసం విద్యార్థులు వెళ్తుంటారు. రోడ్డు బాగా లేక ఇబ్బందులు పడుతున్నాం.

– గీత్ కుమార్, అంబుగామా

పట్టించుకోవడం లేదు



ఏడాది క్రితం ఓలా నుంచి అంబుగామా వరకు నిధులు మంజూరు చేశారు. రెండు కల్వర్టులు మాత్రం నిర్మించి రోడ్డు పనులను నిలిపివేశారు. కంకర తేలి రోడ్డు ఇబ్బందికరంగా మారింది. ఎవరికీ చెప్పిన పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలి.

– రాథోడ్ మోహన్, అంబుగామా

అటెన్షన్ ప్లీజ్.. ఇళ్ల మధ్యన ట్రాన్స్‌ఫార్మర్



లక్ష్మణచాంద: సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలోని బీసీకాలనీ నుంచి సాయిబాబా ఆలయానికి వెళ్లే రోడ్డు పక్కనే, ఇళ్ల మధ్యన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీంతో కాలనీవాసులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – శ్రీనివాస్, ఏఈ విద్యుత్, సోన్, సెల్: 79016 78169

వ్యాయామ పరికరాలు అందజేత



విద్యార్థులకు పరికరాలు అందజేస్తున్న సర్పంచ్


లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులకు సర్పంచ్ ముత్యంరెడ్డి శుక్రవారం వ్యాయామ పరికరాలు అందజేశారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.15 వేలు వెచ్చించి ఈ పరికరాలను వారికి పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి విక్రమ్‌రాజ్, ఎస్‌వో నవిత, ఫిట్‌నెస్ ట్రైనర్ సుమన్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : రైటర్ పద్మభూషణ్
నారాయణ: అమిగోస్
వెంకటేశ్: వాల్తేరు వీరయ్య

ప్రభుత్వ పథకాలపై కళాజాత



విఠపూర్‌లో వివరిస్తున్న కళాకారులు

కుంటాల: మండలంలోని విఠపూర్ గ్రామంలో జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యంలో కళాకారులు ప్రభుత్వ పథకాలపై శుక్రవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ భగీరథ, పింఛన్లు, రైతు బంధు, రైతుబీమా, కంటి వెలుగుపై నాటిక రూపంలో ప్రజలకు వివరించారు. సర్పంచ్ గల్లపూరం లక్ష్మీరమేశ్, కార్యదర్శి కవిత, కళాకారులు సుదర్శన్, సుధాకర్‌స్వామి, తోట లక్ష్మణ్, నర్సయ్య, జితేందర్, అవినాష్, రమేశ్, నాగరాజు, తస్లీమా, మాధవి, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అధికారంలోకి వస్తేనే సమస్యలు పరిష్కారం'



సమావేశంలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

ఖానాపూర్: బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోసంపల్లె గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు టేకు ప్రకాశ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు మోతె రాజలింగు, దాసరి రాజేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారన్నారు. నాయకులు అజ్మీరా హరినాయక్, పడాల రాజశేఖర్, జానుబాయి, సదాశివ్, లక్ష్మణ్, నల్లూరి శ్రీదర్, ఎనగందుల రవి, పుప్పాల ఉపేందర్, కాలేరి రాజేందర్, తూర్పుటి శ్రీను, అమంద రాజ్‌కుమార్, ఎత్తడి పుల్లయ్య తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులకు ఉపాధి కల్పిస్తాం



యాపలగూడ పంచాయతీని పరిశీలిస్తున్న పీడీ విజయలక్ష్మి

పెంబి: భారీ వర్షాల వల్ల వరద తాకిడికి పంటలు కొట్టుకుపోయి నష్టపోయిన రైతులకు గిరివికాస్, ఉపాధిహామీ పథకాల ద్వారా ఉపాధి కల్పిస్తామని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని యాపలగూడ గ్రామంలో నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతివనాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. సర్పంచ్ చంద్రకళ, ఏపీఎం గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, టీఏ అంజయ్య, ఎఫ్‌ఏలు భూమన్న, వినాయక్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రామారావుపటేల్

భైంసారూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీజేపీ నాయకుడు రామారావుపటేల్ అన్నారు. మండలంలోని ఇలేగాం గ్రామంలో కొటిక్‌వార్ విఠల్ స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యం, మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, నాయకులు సోలంకి భీంరావు, మిర్జాపూర్ ఎంపీటీసీ రజాక్, నాయకులు కృష్ణమూర్తి, రత్నాకర్, ఉత్తమ్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ప్రారంభం



నృత్యాలు చేస్తున్న భక్తులు



నూతనంగా ప్రతిష్ఠించిన ఎల్లమ్మ విగ్రహం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలోని నడింపల్లె గ్రామంలో ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 9న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇంటింటా జోగు ఎత్తడం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బైండ్లోళ్ల డప్పుచప్పులు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 12న గంగ స్నానం, 13న పుట్టదని, లంద, ఎల్లమ్మ బోనాలు, 14న రేణుక ఎల్లమ్మ పెద్ద పట్నం, ఎల్లమ్మ–మునిరాజు కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హల్దాలో ఎల్లమ్మ విగ్రహం ప్రతిష్ఠాపన

కుభీర్: మండలంలోని హల్దా గ్రామంలో నూతనంగా నిర్మించిన మందిరంలో శుక్రవారం ఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం హోమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన తర్వాత అన్నదానం చేపట్టారు. సతీశ్ పంతులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీడీసీ అధ్యక్షుడు జిడ్డు గంగాధర్, సర్పంచ్ సాయన్న, మాజీ సర్పంచ్ దేవేందర్, గ్రామస్తుడు మెత్తం పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి భగీరథ నీరందిస్తాం



నల్లాలను పరిశీలిస్తున్న ఈఈ సుధీర్

లోకేశ్వరం: ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరందిస్తామని ఈఈ సుధీర్ అన్నారు. మండలంలోని కన్కపూర్‌లోని ఇంటింటికీ తిరిగి భగీరథ నల్లాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో అక్కడక్కడ లీకేజీ ద్వారా నీరు వృథాగా పోతుందని, వెంటనే మరమ్మతు చేపడతామన్నారు. ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ట్యాప్‌లను బిగించాలన్నారు. డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ శ్రీనివాస్, సర్పంచ్ నరేశ్, కార్యదర్శి భోజన్న ఉన్నారు.

ఓంకారేశ్వర ఆలయ సందర్శన

నిర్మల్‌టౌన్: ఈనెల 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాకేంద్రంలోని వెంకటాద్రిపేట్ కాలనీలోని శ్రీ ఓంకారేశ్వర ఆలయాన్ని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

దాబాల్లో మద్యం అమ్మితే కఠిన చర్యలు

నిర్మల్‌రూరల్: దాబాల్లో మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై చంద్రమోహన్ హెచ్చరించారు. మండలంలోని దాబా హోటల్ నిర్వాహకులను రూరల్ తహసీల్దార్ ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

సారంగాపూర్: నిర్మల్ రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన బి.శ్రీనివాస్ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో మాక్‌పోలింగ్

భైంసాటౌన్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఓటుహక్కు, ఎన్నికల కమిషన్, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కోసమే మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు లింగం, జీవన్‌కుమార్, వికారుద్దీన్, లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.

బీసీబంధు ప్రకటించాలి

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ బంధు పథకాన్ని ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చదివిన చదువుకు ఉద్యోగాలు లేక ఎందరో బీసీ నిరుద్యోగులు ఉన్నారని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

13న ముఠాపూర్ పీఏసీఎస్ ఎన్నికలు

నిర్మల్‌రూరల్: మండలంలోని ముఠాపూర్ పీఏసీఎస్ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి సాయినాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుత చైర్మన్ మహేశ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కోట చిన్న గంగాధర్‌లు తమ వ్యక్తిగత కారణాలతో తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది. 13న నామినేషన్లు స్వీకరించి అవసరమైతే అదేరోజు ఎన్నికలు నిర్వహిస్తామని సాయినాథ్ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన రాజమౌళి, పాండ్వపూర్‌లో నడిపి మల్లేశ్, లక్ష్మి ఇటీవలే మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను పెంబి జెడ్పీటీసీ భుక్య జానుబాయి శుక్రవారం పరామర్శించారు. నాయకులు హపావత్ రాజేందర్, గోపాల్‌రెడ్డి, ఉపేందర్ ఉన్నారు.

ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ముస్తాబు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ విఠలేశ్వర–రుక్మాబాయి స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆలయాన్నీ ముస్తాబు చేశారు. ఈనెల 12 నుంచి ఆదివారం వరకు వైభవంగా ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. 16 వరకు తదితర పూజా కార్యక్రమాలను వేద పండితుడు శ్రీభగవాన్ జోషి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దస్తురాబాద్: మండలంలోని బుట్టపూర్, దస్తురాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏడీఈ కౌట్టి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌రూరల్: తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ మహమ్మద్ సలీముద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో 5వ తరగతి, కళాశాలలో ఎంపీసీ, బైపీసీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు.

నర్సరీ సందర్శన

నర్సాపూర్(జి): గొల్లమాడలో నర్సరీని ఎంపీడీవో వనజ సందర్శించారు. మొక్కల ఎదుగుదలకు రెండు పూటలా నీటిని పట్టేలా చూడాలని సూచించారు. నర్సరీకి గ్రీన్‌షెడ్ వేసి ఉండటంతో కార్యదర్శి నరేశ్‌కుమార్‌ను అభినందించారు.

ఫిష్‌పాండ్ పనులు పరిశీలన

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఫిష్‌పాండ్ పనులను ఏపీడీ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. సర్పంచ్ బొడ్డు గంగన్న, ఏపీవో జయదేవ్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉన్నాయని చైర్మన్ రత్నాకర్ రావు ఓ ప్రకటన తెలిపారు. శనివారం ఉదయం నుంచి యూరియా పంపిణీ చేస్తామని, బ్యాగ్ ధర రూ.270లు ఉందని పేర్కొన్నారు. కావల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు.